క్లుప్తంగా

హైమాస్ లైట్లు ప్రారంభం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గాంధారి–కామారెడ్డి రోడ్డులో గల వాగు వంతెన వద్ద హైమాస్ లైట్లను శుక్రవారం ప్రారంభించినట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఇందుకోసం మండల పరిషత్ జనరల్ ఫండ్ నుంచి రూ.1.30 లక్షలు నిధులు వెచ్చించినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేకాధికారి రేణుకా చౌహాన్, సింగిల్ విండో చైర్మన్ సాయికుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్ ఈహైమాస్ట్‌లైట్లను ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ తూర్పు రాజు, మాజీ సర్పంచ్ సంజీవు, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల తనిఖీ



బాన్సువాడ : బాన్సువాడ డివిజన్‌లో 108, 102, 1962 వాహనాలను శుక్రవారం కామారెడ్డి జిల్లా మేనేజర్ తిరుపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని అంబులెన్సుల్లో పరికరాలు, మందుల వివరాలు పరిశీలించారు. ఉద్యోగులకు సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 108 అంబులెన్సు సిబ్బంది చేస్తున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రసాద్, శివకుమార్, పుండరీకం, రాజు, కమలాకర్, రమేష్, సుభాష్, సతీష్ తదితరులున్నారు.

శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటం వద్ద భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో నందు, బాపురావు, గంగారెడ్డి, నర్సింలు, రాజయ్య, గంగారాం, రాజేందర్, గోవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అనంత చతుర్ధశి వేడుకలు

- జిల్లాలో భిక్కనూరులో ఏకైక అనంతపద్మనాభస్వామి ఆలయం



భిక్కనూరు: జిల్లాలో భిక్కనూరులో ఏకైక అనంతపద్మనాభ స్వామి ఆలయంలో శనివారం అనంతర చతుర్ధశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.ఆలయంలో భక్తులు అనంత కోటి ఒత్తులను వెలిగించనున్న నేపథ్యంలో ఇందుకు తగిన ఏర్పాట్లు చేశారు. వేకువ జామున స్వామి వారికి పంచామృతాభిషేకాం, అర్చన పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఘనంగా మిలాద్‌ఉన్ నబీ



పిట్లం/లింగంపేట : జిల్లావ్యాప్తంగా మైనారిటీలు శుక్రవారం మిలాద్‌ఉన్ నబీ మహమ్మద్ ప్రవక్త జయంతిని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మజీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మహమ్మద్ ప్రవక్త ప్రేమ, త్యాగం, బోధనలు సందేశాన్ని ముస్లిం గురువులు మజీద్‌లలో వివరించారు. ఈకార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన నాయకులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామంలో శుక్రవారం సీపీఐ పార్టీలో పలువురు నాయకులు చేరారు. గ్రామానికి చెందిన ప్రజాపంథా పార్టీ నాయకులు డివిజన్ కార్యదర్శి బాలరాజుతో పాటు పలువురు నాయకులు సీపీఎం రాష్ట్ర నాయకుడు కంజర భూమయ్య సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి సమస్యల సాధనకు పోరాడాలన్నారు. సీపీఐ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో దశరథ్, సాయగౌడ్, రాజేశ్వర్ నాయకులు పాల్గొన్నారు.

ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులు



గాంధారి-దుర్గం మార్గంలో దెబ్బతిన్న రోడ్డు



పోతంగల్ కలాన్ నుంచి కర్ణంగడ్డ తండాకు వెళ్లే మార్గంలో ధ్వంసమైన కల్వర్టు

- గాంధారి మండలంలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని వినతి

గాంధారి(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గాంధారి మండలంలో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొలాల్లో ఇసుక మేటలు పోయేదెలా..

- వదిలేయనున్న వరి పొలాలు
- భారీ వర్షాలు, వరదలతో బీబీపేట మండలంలో రైతులకు తీవ్రనష్టం



బీబీపేట అలుగు వద్ద పొలంలో రాళ్లు, ఇసుకమేటలు పెట్టిన వరి పొలం

బీబీపేట: బీబీపేట మండల వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో పొలాల్లో ఇసుకమేటలు, రాళ్లు, చెట్లు వచ్చి పంటను పూర్తిగా దెబ్బతీశాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు మూడు క్లస్టర్ల పరిధిలో సుమారు 300 ఎకరాల్లో వరి పంట, 7 ఎకరాల్లో మొక్కజొన్న, 5 ఎకరాల్లో చెరుకు పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పంట నష్టం సర్వే కొనసాగుతుందని అంచనాలు పెరగవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బీబీపేట పెద్ద చెరువుల అలుగు ఎన్నడూ రానంతగా ఉధృతంగా ప్రవహించడంతో దానికి ఆనుకొని ఉన్న పంటపొలాలు పూర్తిగా నష్టపోయాయి. వరి పొలాలను వదిలేయడమే ఉత్తమమని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బీబీపేటకు చెందిన రైతు మాణికె రాజు రెండు ఎకరాల వరిపొలంలో ఇసుక, మొరం, చెట్లు, రాళ్లు వచ్చి పెట్టాయి. వాటిని తొలగించడం కష్టంగా మారిందని, ప్రభుత్వం చొరవ తీసుకొని ఉపాధి హామీ కూలీల ద్వారా చదును చేసి ఇవ్వాలని రైతు కోరుతున్నారు.

పంట చేనుల్లో ఇసుక మేటల పరిశీలన



బూరుగిద్ద శివారులో రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బూరుగిద్ద శివారులో శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, డీఆర్‌డీవో సురేందర్ ఇసుక మేటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బూరుగిద్ద శివారులో ఊర కుంటకు గండి పడి తెగిపోయింది. దాంతో కుంటలోని నీరంతా ఆయకట్టు కిందికి వెళ్లడంతో పంట చేనుల్లో ఇసుక మేటలు వెలిశాయి. సుమారు 30 ఎకరాల్లో పంటలు మునిగిపోయాయి. గురువారం సీఎం రేవంత్ రెడ్డి బూరుగిద్ద శివారులోని ఊరకుంట కింద ఏర్పడిన ఇసుక మేటలను పరిశీలించారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఇసుక మేటలు తొలగించి గిరిజన రైతులకు మళ్లీ సదరు భూములు సాగుకు యోగ్యం అయ్యేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు ఊరకుంటకు గండి పడిన ప్రాదేశంతో పాటు ఇసుక మేటలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద ఇసుక మేటలను తొలగించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీలను ఏర్పాటు చేయాలని సూచించారు. పంటలు ముంపునకు గురై ఎంతమంది రైతుల పొలాల్లో ఇసుకమేటలు వెలిశాయే వివరాలు సేకరించాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి మండల వ్యవసాయాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఆర్ఐ కిరణ్, ఏపీవో నరేందర్, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాట ఫలితమే లేబర్ ఇన్సూరెన్సు పెంపు



బాన్సువాడలో మాట్లాడుతున్న నాయకులు

బాన్సువాడ : భవన నిర్మాణ కార్మికుల పోరాట ఫలితమే లేబర్ ఇన్సూరెన్సును పెంచారని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ రాములు అన్నారు. శుక్రవారం బాన్సువాడ సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్ ఇన్సూరెన్సు డబ్బులు పెంచాలని అనేక ఉద్యమాలు చేశామన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సహజ మరణానికి ఇచ్చే ఎక్స్‌గ్రేషియా రూ. 1.30 లక్షల నుంచి రూ. 2లక్షలకు పెంచిందని, ప్రమాదవశాత్తు మరణిస్తే ఇక నుంచి రూ.10 లక్షలు అందనున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు సురేష్, సుదర్శన్, సాయిబాబా, హన్మాండ్లు, కిష్టయ్య తదితరులున్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బాన్సువాడలో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. సిద్దిపేట జిల్లాలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. బాన్సువాడకు చెందిన మాజీ జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్ నార్ల రత్నకుమార్‌తో పాటు ఇషాక్, గులెపల్లి మొగులయ్య, మల్లిబాబుతో పాటు కోటగిరి, వర్ని మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులకు కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తరలి వెళ్లినవారిలో బీఆర్ఎస్ నాయకులు జుబేర్, అంజిరెడ్డి, ఎలమంచలి శ్రీనివాస్‌రావు, కోటగిరి శ్రీనివాస్‌రావు, కిషన్, ఎర్రవాటి సాయిబాబా, మోచీ గణేష్, గాండ్ల కృష్ణ, బోడ చందర్, ఉమామహేష్, రమేష్‌యాదవ్, శివసూరి తదితరులున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఎల్లారెడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్స్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



అన్నాసాగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు



కామారెడ్డిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్/కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్, కామారెడ్డి నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డిలోని లిటిల్ స్కాలర్ స్కూల్‌లో జిల్లాలోని 20 మంది ముదిరాజ్ ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, ప్రశంసపత్రాలు అందజేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూప్‌కు మార్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పున్న రాజేశ్వర్, గజ్జల భిక్షపతి, నంద రమేష్, నిజ్జన రమేష్, కరాటే రమేష్, విజయానంద్, మహేష్ తదిరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని 25 మంది ఉపాధ్యాయులను శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని గడ్డం చంద్రోశేఖర్ రెడ్డి అన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, ఎంఈవో ఆనంద్ రావు, పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు గోవర్ధన్, సీనియర్ ప్రధానోపాధ్యాయులు గంగాకిషన్, మాజీ కౌన్సిలర్లు జూలూరు సుధాకర్, చాట్ల వంశీ కృష్ణ, పంపరి శ్రీనివాస్, పిడుగు మమత, నాయకులు సాయిబాబ, తాటి ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు గంగా కిషన్, జంగం శ్రీశైలం, రాములు, మల్లేష్, మార బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని లిటిల్ స్కాలర్ స్కూల్‌లో సన్మానం పొందిన ముదిరాజ్ ఉత్తమ ఉపాధ్యాయులు

వేంకటేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి –మంజులరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు మాజీ ఎమ్మెల్యే దంపతులను తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వాదించారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ దంపతులు, కాంగ్రెస్ నాయకులు నందురెడ్డి, మాసాని శ్రీనివాస్ రెడ్డి, కమలాకర్‌రెడ్డి, కమ్మ సత్యనారాయణ, మంత్రి గణేష్, మంత్రి అంజవ్వ, కొత్తకొండ భాస్కర్, స్వరూప, దేవేందర్‌రెడ్డి, పాండు తదితరులున్నారు.

కృష్ణానంద స్వామికి సన్మానం



కామారెడ్డి అర్బన్: స్థానిక గంజ్ వర్తక సంఘం 76వ వార్షిక గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసిన శ్రీరామకోటి జప లిఖిత ప్రచారకులు కృష్ణానంద స్వామిని శుక్రవా రం సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంజ్‌వర్తక సంఘం అధ్యక్షులు యాద రాజేశ్వర్‌రావు,ప్రతినిధులు నంగునూరి అశోక్, పాత అంజయ్య,పాత ప్రవీణ్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఉపవాస్ దివాస్



కామారెడ్డి టౌన్: నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్ఎంఓపీఎస్) పిలుపు మేరకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ చేయాలని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉపవాస్ దివాస్ కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుంట ఎల్లారెడ్డి తన నివాసంలో దీక్ష చేపట్టారు. ఉద్యోగుల సంక్షేమం చూసే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తున్న సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలు చేసే వరకు నిరంతరంగా పోరాటం చేస్తామని తెలిపారు.

ఘనంగా వాసవీమాత శిఖర ప్రతిష్ఠాపన



శిఖర ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన వాసవీ కన్యాకపరమేశ్వరీ ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.వేద పండితుడు బ్రహ్మశ్రీ గంగవరం ఆంజనేయశర్మ పూజారి నవీనశర్మల ఆధ్వర్యంలో శిఖరానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో శ్రీ సిద్దరామేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం కోశాధికారి చీకోటి వెంకటేశం, ఆలయం నిర్మాణ దాత కోలవార్ ప్రకాశ్, ప్రతినిధులు పబ్బ జగన్నాథం, పబ్బ నాగరాజు, శనిశెట్టి రాజలింగం, అతిమాముల రమేష్, శనిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్‌లో యూనియన్ నాయకుల నిరసన

- పనిఒత్తిడి కారణంగా గుండెపోటుతో ఏఈవో మృతి చెందాడని ఆరోపణ
- కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్



పుల్కల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన బస్వారాజ్ (30) డోంగ్లిలో ఏఈవోగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఉన్నతాధికారులు పని ఒత్తిడి కారణంగా బస్వారాజ్‌కు గుండెపోటు వచ్చిందని వ్యవసాయ యూనియన్ జిల్లా టీఎన్‌జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు. యూనియన్ నాయకులు, తోటి ఉద్యోగులు పుల్కల్‌లో జరిగిన అంత్యక్రియలో పాల్గొని నిరసన తెలిపారు. బస్వారాజ్ ఆత్మకు శాంతి కలగానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏఈవోలకు పంటనష్టం వివరాలు, పండిస్తున్న క్రాప్ వివరాలు, యూరియా పంపిణీ ఇతర బాధ్యతలు అప్పగించి సూచించిన సమయంలో అన్ని పూర్తి చేసి నివేదికలు అందించాలని ఒత్తిడి చేసి పనిభారం పెంచుతుందని ఆరోపించారు. ప్రభుత్వం చిన్న ఉద్యోగులపై పని ఒత్తిడి పెంచొద్దని ప్రాణాలు కాపాడాలని కోరారు. బస్వారాజ్ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం స్పందించి ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు అమర్ ప్రసాద్, రాజు, కిషన్, రాజలింగం, దయానంద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



రామేశ్వర్‌పల్లిలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: కేంద్ర ప్రభుత్వం పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శుక్రవారం నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు సింగిరెడ్డి విలాస్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిగారి రమేష్‌రెడ్డి, బీజేపీ నేతలు సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రంజీత్‌కుమార్, బల్ల బాల్‌లింగం,జైపాల్‌రెడ్డి,కుడిక్యాలఏక్‌నాథ్, నాగార్తి రాజిరెడ్డి,అలకొండ రవీందర్‌రెడ్డి,పనసానర్సింలు, తక్కళ్ల రాజేందర్‌రెడ్డి, నల్ల మైపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మున్నూరుకాపు వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భీమేష్



కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు సంఘం వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన వ్యాపారి ముదాం భీమేష్ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమరావు పటేల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల అంజయ్య గురువారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడ డివిజన్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పరిగె మోహన్‌రెడ్డిని శుక్రవా రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాన్సువాడ వి శ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో జరిగిన 2025 నుంచి 2028 వరకు కొనసాగే తాలుకా కార్యవర్గా న్ని ఎన్నికల అధికారి అర్జున్‌రావు ఆధ్వర్యంలో ఎ న్నుకున్నారు. అధ్యక్షుడిగా పరిగె మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దయానంద్, గంగాధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా హన్మండ్లు, అసోసియేషన్ అధ్యక్షుడిగా జల్ల కాశీనాథ్, పబ్లిసిటి కార్యదర్శిగా విఠల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అమీన్, సహాయ కార్యదర్శిగా భూమయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమైక్య మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్



భిక్కనూరు: సమైక్య మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా భిక్కనూరు మండలం లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన పిట్ల రాజశేఖర్‌ను శుక్రవారం నియమించారు. ఈమేరకు హైదరాబాద్‌లో రాజశేఖర్‌కు నియమాకపత్రాన్ని సమైక్య మానవ హక్కుల కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు సాయికుమార్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. మానవ హక్కులకు ఎవరైనా భంగం కల్గిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా అధికారులకు ఫిర్యాదులు చేయాలన్నారు.

పల్లెల్లో వైద్యశిబిరాలు



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని జక్కాపూర్, తుంకిపల్లి తండాలో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. దగ్గుదమ్ము, జ్వరాలు, తలనొప్పితో బాధపడుతున్న రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704400298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899